క్లుప్తంగా

రేపు వాకతిప్పలో ఎమ్మెల్సీ తోట పర్యటన

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప గ్రామంలో గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పర్యటించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట ప్రజల సమస్యలను తెలుసుకుంటారు. మధ్యాహ్నం 1 గంటకి నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో పూర్తి సమాచారంతో అందుబాటులో ఉండాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ ద్వారా ప్రజలు ఎక్కువగా వస్తువులు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని నేరగాళ్లు మనం ఆర్డర్ పెట్టని వస్తువులు ఇంటికి తీసుకువచ్చి మనది కాదని చెప్పగానే ఆర్డర్ క్యాన్సిల్ చేస్తున్నానని మీ ఫోన్‌కి ఓటీపీ నంబర్ వస్తుంది చెప్పమని అడుగుతున్నారన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పగానే మన బ్యాంక్ ఖాతాలో సొమ్ము మాయమవుతుందన్నారు. ఏ సమయంలోనైనా సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీ నంబర్లు బయటకు చెప్పే విషయంలో ప్రజలు పూర్తిగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చురుగ్గా వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం



నేలటూరులోని వెల్ నెస్ సెంటర్ భవన శ్లాబుకు ఐరన్ పని చేస్తున్న శ్రామికులు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో చేపట్టిన వెల్‌నెస్ భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు పర్యవేక్షణలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిమ్మకాయల పద్మరాజు నిర్మాణ పనులు చూస్తున్నారు. త్వరితగతిన భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు.

మాజీ సర్పంచ్ సుబ్బారావు మృతి



మండపేట: మండలంలోని జెడ్.మేడపాడు మాజీ సర్పంచ్ సంగిశెట్టి సుబ్బారావు (83) మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాయవరం మునసబు ఉండవల్లి సత్యనారాయణమూర్తి ప్రధాన అనుచరుడైన సుబ్బారావు 1967 నుంచి 72 వరకు పంచాయతీ సర్పంచ్‌గా సేవలందించారు. సుబ్బారావు మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ద్వారపూడి ఉప సర్పంచ్ తులా శేషారావు, వైఎస్సార్ సీపీ ద్వారపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామ వర్మ, రిటైర్డ్ పోస్టుమాస్టర్ టి.పుల్లేశ్వరరావు, కొండపల్లి సూర్యనారాయణ, పలువురు పోస్టల్ ఉద్యోగులు మంగళవారం సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఐదు సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి మంగళవారం నోటిఫికేషన్‌విడుదల చేసినట్టు ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ జయలక్ష్మి తెలిపారు. కపిలేశ్వరపురం మండలంలోని నిడసనమెట్టలో ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టును ఓసీ లకు రిజర్వ్ చేసినట్టు తెలిపారు. కపిలేశ్వరపురం మండలం నల్లూరు, కపిలేశ్వరపురం గ్రామాల్లోని ఒక్కొక్క కేంద్రంలోని సహాయకురాళ్ల పోస్టులను ఓసీకి, రాయవరం మండలంలోని కురకాళ్ళపల్లి సహాయకురాలి పోస్టును బీసీ ఎ, సోమేశ్వరం వినాయక కాలనీ సమీప కేంద్రంలోని సహాయకురాలి పోస్టును ఎస్సీకి, సోమేశ్వరంలోని కొబ్బరి తోట సమీపంలోని కేంద్రం సహాయకురాలి పోస్టును ఓసీకి కేటాయించినట్టు వివరించారు. ఆసక్తి గల వారు తన కార్యాలయంలో దరఖాస్తు తీసుకుని పూర్తి చేసి ఈనెల 30లోపు తన కార్యాలయంలో అందజేయాలన్నారు. పదో తరగతి విద్యార్హతగల స్థానిక వివాహ మహిళలు దరఖాస్తుకు అర్హులన్నారు.

లోపాలు దిద్దుకుంటూ ముందుకు వెళ్లాలి

కొత్తపేట: సమాజంలో ప్రతి ఒక్కరి పాత్రను సాక్షి స్థితిలో చూడాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రీజనల్ (4 జిల్లాల) ఇన్‌చార్జ్ రజని అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కొత్తపేట శాఖ మందిరంలో మంగళవారం సాయంత్రం రాఖీ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రజనీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలువురు అన్నలకు నుదుటన తిలకం దిద్ది, రాఖీ కట్టి, స్వీటు తినిపించారు.

కలవరపెడుతున్న కలుపు

- రైతుల ఆందోళన
- నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు



గొల్లపాలెంలో వెదచల్లిన పొలంలో వరి మొక్కలను అధిగమించి పెరుగుతున్న కలుపు మొక్కలు

కాజులూరు: నియోజకవర్గ గ్రామాల్లోని వరి రైతులను కలుపు తీవ్రత కలవరపెడుతుంది. తొలకరి తొలిదశలో వరుణుడు ముఖం చాటేయడంతో తూర్పు డెల్టాకాలువకు ఇరిగేషన్ అధికారులు పరిధి మించి సాగునీరు విడుదల చేస్తున్నా కాలువ శివారు భూములకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. పొలాల్లో నీరు నిలిచి ఉండకపోతే కలుపు తీవ్రత ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. దానికి తోడు నియోజకవర్గంలో 56 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ప్రస్తుత ఖరీఫ్‌లో సుమారు 85 శాతం పొలాల్లో రైతులు వెదజల్లు విధానాన్నే అవలంబించారు. సాధారణ పద్ధతిలో రైతులు దుక్కుదున్ని పొలాన్ని చదునుచేసి నాట్లు వేస్తారు. ఈ విధానంలో కలుపు తీవ్రత తక్కువగా ఉంటుంది. అయితే వెదజల్లు పొలాల్లో వరి మొక్కతో పాటు కలుపుమొక్క సమాంతరంగా పెరుగుతుంది. ఈ కలుపు మొక్కలను సకాలంలో నివారించకుంటే అవి ఎరువులను, భూమిలోని పోషకాలను ఉపయోగించుకుని క్రమేపీ వరి మొక్కలను అధిగమించి పెరుగుతాయి. నియోజకవర్గ గ్రామాల్లో వెదజల్లిన పొలాల్లో కలుపు తీవ్రత ఊహించిన దానికంటే ఎక్కువగానే ఉందని రైతులు చెబుతున్నారు. కొన్ని రకాల కలుపు మొక్కలను నివారించడం కష్టతరంగా ఉందంటున్నారు. తెలిసి, తెలియని రసాయన మందులు వాడితే కలుపు మొక్కతో పాటు వరిమొక్క చనిపోతుందని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వెదజల్లిన పొలాల్లో రైతులు కలుపు నివారణకు రసాయన మందులను నిర్ణయించిన మోతాదులో సకాలంలో వాడాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు.

కలుపు నివారణ మార్గాలు

వెదజల్లిన పొలాల్లో వరిమొక్క బొడ్డు మొలవక ముందే కలుపు నివారించుకోవడం సులభతరమని ఏఓ అశోక్ చెబుతున్నారు. విత్తనాలు చల్లిన మూడు రోజుల్లోపు పొలంలో నీరు తీసివేసి సాతి 120 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా దుంపజాతి కలుపు నివారణకు లోంబాక్స్ పవర్ మందును ఎకరానికి నాలుగు కేజీలు చొప్పున విత్తనాలు చల్లిన మూడు రోజుల లోపు చల్లితే దుంపతో సహా నిర్మూలించబడుతుందన్నారు. మూడు నుంచి ఐదు రోజుల మధ్యలో స్టాప్‌స్టార్ 35 గ్రాముల మందును అరలీటరు నీటిలో కలిపి ఆ మందు ద్రావణాన్ని 20 కేజీల గోదావరి ఇసుకతో కలిపి ఎకరం పంటపై బురద పదునుపై చల్లుకోవాలన్నారు. 15 నుంచి 20 రోజులకు కలుపు ఇంకా ఉన్నట్టయితే నామినీ గోల్డ్ మందును 100 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 15 రోజుల తర్వాత పొలంలో వుడా, జోడల గడ్డి వంటి వెడల్పాటి ఆకులు కలిగిన కలుపు మొక్కలు కనిపిస్తే 2,4-డి సోడియం సాల్ట్ 500 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పొలంలో పిచికారీ చేయాలన్నారు. కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు పొలంలో పలుచటి నీటిపొర మాత్రమే ఉండాలన్నారు. నీరు నిలబడితే మొక్కలు చనిపోతాయన్నారు. వెదచల్లిన పొలాల్లో కలుపును సమర్థవంతంగా నివారించి తెగుళ్లను అధిగమించగలిగితే నాట్లు వేసిన పొలం కంటే ఎకరాకు ఐదు నుంచి పది బస్తాలు ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు.

28న మండపేటలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లోక్‌మాన్ తదితరులు

మండపేట: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి లోకమన్ తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు సేవా రంగాల సమన్వయంతో నిర్వహిస్తున్న జాబ్ మేళాను మండపేట, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.12 ప్రముఖ కంపెనీలకు సంబంధించి సుమారు 950 ఖాళీలను జాబ్ మేళాలో భర్తీ చేస్తారన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు నిరుద్యోగులు 9603161039, 8099183854 నంబర్లకు సంప్రదించాలని లోకమాన్ కోరారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, స్కిల్‌హబ్ కో–ఆర్డినేటర్ వినోద్‌కుమార్, లెక్చరర్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని సందర్శించిన హౌసింగ్ సీఈ



సోమేశ్వరం జగనన్న కాలనీ సందర్శించి సూచనలిస్తున్న గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్

రాయవరం: మండలంలోని సోమేశ్వరం జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్ జి.వీరేశ్వరప్రసాద్ మంగళవారం సందర్శించారు. సామూహిక గృహ ప్రవేశాలకు జిల్లాలో సోమేశ్వరం జగనన్న కాలనీని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ పీడీ బాబూరావుతో కలిసి ఆయన కాలనీని పరిశీలించారు. కాలనీలో ప్రతి ఇంటికి తాగునీటి వసతి, విద్యుత్తు, డ్రైనేజీ, రహదారులు, టాయిలెట్ వంటి మౌలిక సౌకర్యాలు ఏ విధంగా కల్పించారన్న అంశాన్ని ప్రధానంగా పరిశీలించారు. అలాగే సోమేశ్వరం–రాజానగరం ప్రధాన రహదారి నుంచి జగనన్న కాలనీకి వెళ్లే అప్రోచ్ రహదారి పనులు, కాలనీ ఆర్చ్ నిర్మాణ పనులను వీరేశ్వరప్రసాద్ పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఇంటర్నల్ రహదారులను కూడా వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని సర్పంచ్ ఆరిఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో అధిక సంఖ్యలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, గృహ నిర్మాణశాఖ ఈఈ మల్లికార్జున్, డీఈఈ రఘురామ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయ ఏవో శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ రామనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న పల్లె వాతావరణం



కె.గంగవరంలో పచ్చదనంతో ఆకట్టుకుంటున్న పంట పొలాలు

కె.గంగవరం: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అనే నానుడికి రామచంద్రపురం నియోజకవర్గమే నిదర్శనం. అటు జీవనశైలిలోనూ ఇటు పల్లె అందాల్లోనూ పట్టణవాసులకు కనువిందు చేస్తుంది. మానవుని జీవన గమనంలో దాదాపు సుదీర్ఘకాలం పాటు వెన్నంటి వచ్చేది పల్లెలు మాత్రమే. ప్రస్తుతం పల్లె వాతావరణం పుడమి తల్లికి పచ్చబొట్టు వేసినట్లు కనువిందు చేస్తుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న తరుణంలో నల్లగా కనిపించే భూమి మొత్తం వరి నాట్లు వేయడం వల్ల పచ్చరంగుతో నిండి ఆహ్లాదాన్ని అందిస్తుంది. ఒకపైపు ఆకాశం మబ్బులతో పల్లె వాతావరణం ఊటీని తలపిస్తుంది.

చంద్రయాన్-3 విజయవంతం కావాలి

రామచంద్రపురం రూరల్: నేటి చంద్రయాన్-3 ల్యాండర్ 'విక్రమ్' చందమామపై సురక్షితంగా కాలు మోపాలని ఆకాంక్ష వెలిబుచ్చుతూ ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాకెట్ ఆకారంలో కూర్చుని ప్రదర్శన చేశారు. జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, సైన్స్ ఉపాధ్యాయులు వాడ్రేవు భాను గాయత్రి, పసుపులేటి మెహర్ సుజాత, డ్రాయింగ్ టీచర్ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, కంప్యూటర్ అసిస్టెంట్ రాజశేఖర్‌లు పర్యవేక్షించారు.



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో రాకెట్ ఆకారంలో విద్యార్థులు

రిజిస్ట్రేషన్లకు సులభమైన సాఫ్ట్‌వేర్



ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మి

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలోని సామాన్యులు సైతం భూమి రిజిస్ట్రేషన్ తదితర కార్యకలాపాలు సులభంగా చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టిందని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు, రైతులతో ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కొత్త సాఫ్ట్‌వేర్ సాయంతో తమ ఇళ్ల వద్దనే రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు ఉందన్నారు. డాక్యుమెంట్లు కూడా చాలా సులభంగా తయారు చేసుకునే విధంగా పలు నమూనాలు అందుబాటులో ఉంటాయన్నారు. తమ వివరాలను మాత్రమే నమోదు చేస్తే సరిపోతుందన్నారు. డాక్యుమెంట్లు చిటికెలో తయారు చేయడం సాధ్యమవుతుందన్నారు. ద్రాక్షారామలో ప్రయోగాత్మకంగా పరిశీలించిన తరువాత సాంకేతిక సమస్యలు ఏమైనా తలెత్తితే వాటిని సరిదిద్ది రాష్ట్రవ్యాప్తంగా అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ దీనిని అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రారు బి.శ్రీనివాసులు, ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రారు ఆర్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలు వినియోగించుకోవాలి



అన్నాయిపేట సచివాలయంలో ఆధార్ ప్రత్యేక క్యాంపును పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శాంతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటలో మంగళవారం ప్రారంభించిన ప్రత్యేక ఆధార్ క్యాంపును రామచంద్రపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీఓ) తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గడచిన పదేళ్లుగా ఒక్కసారి కూడా తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోని వారు తప్పనిసరిగా ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకుని ఆధార్‌లు అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. దీనితో పాటుగా కొత్తగా నమోదు చేసుకోవడానికి, ఫోన్ నంబరు లింకు చేయడం తదితర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 22, 23 తేదీల్లో అన్నాయిపేట గ్రామ సచివాలయం వద్ద 24, 25 తేదీల్లో వెలంపాలెం గ్రామ సచివాలయం వద్ద ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.



నేలటూరులో ఆధార్ నవీకరణ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ దొరబాబు

53 మందికి ఆధార్ నవీకరణ

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరాల్లో 53 మందికి ఆధార్ కార్డు వివరాలను నవీకరించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో కపిలేశ్వరపురం, వల్లూరు డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, కోరా దొరబాబు మాచర, నేలటూరు సచివాలయాల్లోనూ సేవలందించారు. మాచరలో 20, నేలటూరులో 33 మందికి కొత్త ఆధార్ కార్డులు మంజూరు చేశారు. అలాగే పాతవాటిలో ఫొటో, వేలిముద్రలు, అడ్రస్ మార్పు తదితర వివరాలను నవీకరించారు. అవే గ్రామాల్లో రెండో రోజు కూడా బుధవారం శిబిరాలు కొనసాగించనున్నట్టు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.

తుప్పలతో ప్రమాదం



కోట రోడ్డులో ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా ఉన్న తుప్పలు

కె.గంగవరం: ఏటిగట్టుపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. కోటిపల్లి నుంచి కోట వరకు ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికి తోడు తుప్పలు రోడ్డు మధ్య వరకు ఎదగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ నెల మొదటి వారంలో ఇదే రహదారిలో తుప్పల వల్ల పలువురు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవగా ఓ వ్యక్తి మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్లుకు ఇరువైపులా చెత్తమొక్కలు ఏపుగా ఎదిగి ప్రమాదకరంగా మారాయి. గత ఏడాది ఆర్‌అండ్‌బీ అధికారులు తుప్పలను తొలగించినా మళ్లీ అవి ఎదిగిపోయాయని పూర్తి స్థాయిలో వీటిని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రి రోగులకు రక్షిత నీరు

- ఎమ్మెల్సీ తోట చొరవతో ఏర్పాటు



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు మండల పరిషత్ అధికారులు రక్షిత నీటి సదుపాయం కల్పించారు.వైద్య సేవల నిమిత్తం రోజూ 200 నుంచి 250 మంది రోగులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. 50 మందికి పైగా ఇన్‌పేషెంట్లు ఉంటారు. గతంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ కొద్దికాలంగా పనిచేయక ఆస్పత్రి వచ్చేవారు రక్షిత నీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఆస్పత్రి కమిటీ సభ్యులు సమస్యను ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. మండల పరిషత్ నుంచి ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఎంపీడీఓ ఐ.రాజుకు సూచించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కన్వర్జెన్సీ నిధులు సుమారు రూ.లక్ష వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంటు పనితీరును ఎంపీడీఓ రాజు పరిశీలించారు.

గర్భకోశ వ్యాధులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జ్యోతిర్మయి

మండపేట: మండపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఇన్ మీ ఆస్పత్రి వద్ద పీఎంపీలకు వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ గైనకాలజిస్ట్ జ్యోతిర్మయి హాజరయ్యారు. మహిళలు ఎక్కువగా ఇబ్బందులకు గురయ్యే గర్భకోశ వ్యాధుల గురించి ఆమె వివరించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ గురించి పీఎంపీలకు అవగాహన కల్పించారు. పీఎంపీలు ఆధునిక వైద్య పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండటం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసాయం అందించేందుకు వీలుంటుందన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు డాక్టర్ జ్యోతిర్మయిని ఘనంగా సత్కరించారు. ఫిజియో థెరపిస్ట్ ఐ విశ్వనాథరావు, అసోసియేషన్ నాయకులు గంగుమళ్ళ రాంబాబు, ఎం.సత్యనారాయణ, సూరంపూడి వీరభద్రరావు, బీవీ రమణ, వీకే రాజు, మండిపూడి చంద్రశేఖర్, ఆర్ ఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే

- ఇంటింటా వివరాలు సేకరణ
- 94 శాతం పూర్తయిన సర్వే
- నియోజకవర్గంలో 1,90,447 ఓట్లు



ఓటర్ల ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్న ఆర్డీవో సింధు సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం: రాజకీయ నాయకుల భవిష్యత్‌ను తలకిందులు చేయటంతో పాటుగా దేశ భవిష్యత్‌ను తలమానికంగా చేసే శక్తి ఓటు హక్కు. దేశంలో 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభిస్తుంది. దీని కోసం ఏటా కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఓటును వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2024 పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుంది. జూలై 21న ప్రారంభమైన ఈ సర్వే ఈనెల 21తో ముగిసింది. బూత్ స్థాయి అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, గ్రామాల్లో నేరుగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేసి పూర్తి వివరాలను సేకరించారు. రామచంద్రపురం నియోకవర్గంలో మొత్తం ఓట్లు సంఖ్య 1,90,447గా తేలింది. నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి, ఆర్డీవో సింధు సుబ్రహ్మణ్యం నేతృత్వంలో బీఎల్వోలు, సర్వేను 94 శాతం పూర్తి చేశారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు

పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. గ్రామాల్లో ఇంటింటా సర్వేను రెవెన్యూ డివిజినల్ అధికారి సింధు సుబ్రహ్మణ్యం పర్యవేక్షిస్తున్నారు. ఎక్కువ ఓట్లు లేదా అడ్రస్సు మార్పు ఉన్న ఓటర్ల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేస్తు ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు ప్రక్రియలో సహకరించాలని కోరారు.

సర్వే ఇలా..

అర్హత ఉండి 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారిని ఓటర్ల జాబితాలో చేరుస్తారు. వీరి నుంచి ఫారం -6తో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుంటారు. తప్పులు సవరణ, కొత్త ఓట్లు నమోదు, మృతులు, నకిలీ ఓట్లు గుర్తిస్తారు. ఓటర్ల జాబితాలో ఒకటి కన్నా ఎక్కువ సార్లు ఓటు నమోదు ఏదైనా జరిగినా, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారు ఉంటే వారి ఓట్లు కూడా గుర్తిస్తారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో ఫొటో సరిగా కనిపించనట్లయితే మార్చుకునే అవకాశం కల్పించారు. వయసులో వ్యత్యాసం ఉన్నా, ఇంటి చిరునామా మార్పు ఉన్నా, వ్యక్తిగత వివరాల్లో మార్పులు చేర్పులు ఉంటే సవరించుకోవటం వంటి అవకాశాలు కల్పించారు. ఒకే ఇంట్లో పదికి మించి ఎక్కువ ఓట్లు ఉంటే వారిని గుర్తించి, ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి వారి ఓట్లు నిజమైతే వారికి తాత్కాలికంగా నోషనల్ ఇంటి నంబర్లు జారీ చేస్తారు. ఓటర్ల జాబితా సవరణకు యాప్ వెర్షన్ 5.1 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, పాతవి తొలగించటం వంటివి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

కేవలం బీఎల్వోలతో ఓటర్ల జాబితా ఇంటింట సర్వేను పూర్తి చేయటం జరుగుతుంది. 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తున్నాం. సర్వే అంతా పారదర్శకంగా నిర్వహించాం. ఓటును తొలగించాల్సి వస్తే సంబంధింత ఓటర్లకు నోటీసులు ఇచ్చిన తరువాత తుదిపరి చర్యలు తీసుకోవాలని బీఎల్వోలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి సర్వేను చేయించాము.

– పి.సింధు సుబ్రహ్మణ్యం, ఆర్డీవో, నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి

నియోజకవర్గంలో సర్వే చేసిన దరఖాస్తులు ఇలా..

మండలం	మొత్తం ఓట్లు	ఇంట్లో లేనివారు	ఇళ్లు మారిన ఓట్లు	మరణించిన ఓట్లు	డబుల్‌ఎంట్రీ
కె.గంగవరం	50547	51	304	1607	39
రామచంద్రపురం టౌన్	32971	139	126	577	57
రామచంద్రపురం రూరల్	55803	63	157	1409	66
కాజులూరు	51126	6	108	1657	24

పంట కాలువలో మహిళ మృతదేహం

రామచంద్రపురం: పట్టణంలోని బైపాస్ రోడ్డులో డంపింగ్ యార్డు పక్కన ఉన్న పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు రామచంద్రపురం పట్టణ ఎస్సై డి.సురేష్‌బాబు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. సుమారుగా 45–50 ఏళ్ల వయస్సు గల మహిళ మృతదేహాన్ని గుర్తించగా స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మహిళ శవం గురించి వివరాలు తెలిసిన వారు ఎవరైనా పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్ 08857–242333, ఎస్సై ఫోన్ నంబర్ 9440796589 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.